ప్రజాశక్తి
శుక్రవారం 20 సెప్టెంబర్ 2024
5
పార్వతీపురం మన్యం

డ్రాయింగ్, హ్యాండ్లూమ్, టైలరింగ్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - పార్వతీపురం

ఏప్రిల్‌లో జరిగిన డ్రాయింగ్ లోయర్, హయ్యర్ టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులు, హ్యాండ్లూమ్ వీవింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయని జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరీక్షలకు జిల్లా నుంచి 2356 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. అందులో 1,965 మంది అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారని (83.40శాతం) తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఈనెల 17 నుండి www.bse.ap.gov.in వెబ్సైట్ ద్వారా మార్కుల మెమోరాండంను డౌన్లోడ్ చేసుకోవచ్చునని సూచించారు.

మేనిఫెస్టోను ఆవిష్కరిస్తున్న సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్

ఇప్పుడిప్పుడే ఏర్పడిన ప్రభుత్వాన్ని హామీలు సంగతి గట్టిగా అడగలేం. ఇది సబబు కాదు కూడా కొందరు అంటుంటారు. కానీ, 'ఇది మంచి ప్రభుత్వం, ఎందుకంటే 100 రోజుల్లో ఎంతో సాధించింది. సంక్షోభంలోనూ సంక్షేమం సాధించి, రెక్కలు తొడిగింది' అంటూ నేటి నుంచి ఆరు రోజులపాటు ప్రభుత్వం గ్రామ సభలకు సిద్ధమౌతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ హామీలు, అమలు, ప్రజల ఆశలు, ఆకాంక్షల గురించి జనం చర్చించు కుంటున్నారు.

- భరోసాగా మిగిలిన సూపర్-6
- సకాలంలో వేతనాలు, పింఛన్లు
- కూటమి ప్రభుత్వానికి నేటికి వంద రోజులు
- 'ఇది మంచి ప్రభుత్వం' అంటూ నేటి నుంచి గ్రామసభలు

అమలు కాని హామీలెన్నో

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి అధికారం చేపట్టి నేటికి వందరోజులు పూర్తయింది. ఎంతో అభివృద్ధి, మరెంతో సంక్షేమం చేపట్టినట్టు ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. ఈ ప్రగతిని వివరించేందుకు ఈ నెల 20నుంచి 26 వరకు 6 రోజులపాటు నిర్విరామంగా గ్రామసభలు నిర్వహించనున్నారు. తద్వారా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించనున్నారు. ఇందుకు అధికార యంత్రాంగం సైతం సమాయత్తమైంది. పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తొలిరోజు సాలూరు మండలం మామిడిపల్లిలో పాల్గొంటారు. మిగిలిన ఎమ్మెల్యేలు కూడా ఈ ఆరు రోజులపాటు గ్రామసభల్లో పాల్గొంటారు. ఈ సంగతి కాస్త అటుంచితే....

గడిచిన వందరోజుల్లో కూటమి ప్రభుత్వ హామీల రుచిప్రజలకు చూపించలేక పోయారన్నది వాస్తవమేనని జనం చర్చించుకుంటున్నారు. ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించడం, పింఛన్లు రూ.1000 పెంపు, ప్రజలు, కూటమి నాయకుల విరాళాలతో చేపట్టిన అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ వంటివి మినహా పెద్దగా చేసిందేమీ లేదని చెప్పుకుంటున్నారు. ధాన్యం సొమ్ము రైతులకు సకాలంలో చెల్లించినట్టు చెప్పుకుంటున్నా అటువంటి లావాదేవీలు మన జిల్లాలో చాలా తక్కువ. పైగా సకాలంలో చెల్లింపులు అనేది కూడా అర్ధసత్యమే అవుతుంది. ఇక మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వకముందే రాకముందే ప్రభుత్వం తన ఖాతాలో వేసుకుంది. నయా పైసా ఖర్చుతో సంబంధం లేని ల్యాండ్ టైటిలింగ్ యాక్టును కూడా ఏదో సాధించిన విధంగా గొప్ప చెప్పుకుంటోంది. ఇవి మినహా కూటమి నెరవేర్చిన హామీలుగా, సమస్యల పరిష్కారం గుర్తించి చెప్పుకునేందుకు పెద్దగా ఏమీ లేవు.

ముఖ్యంగా పాఠశాలలు ప్రారంభించి మూడు నెలలు గడిచినా 'తల్లికి వందనం' హామీ నెరవేరలేదు. దీంతో, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ పంటల సాగు నడిగాలానికి వచ్చింది. పెట్టుబడుల కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. పెట్టుబడి సాయం కింద ఇస్తామన్న రూ.20వేలు గురించి ప్రభుత్వం నోరు మెదపడం లేదు. ఉచిత గ్యాస్ సిలెండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సహా సూపర్ -6 హామీలేవీ ఇంకా అమలుకు నోచుకోలేదు. ఇంకా అమలు చేస్తామనే చెప్తున్నారు తప్ప ఆచరణకు నోచుకోక పోవడంతో జనంలో నిరాశ పెరుగుతోంది. స్థానిక సమస్యలు పరిష్కారం, అభివృద్ధి కూడా నేతిబీరకాయలో నెయ్యి వెతికిన చందమే. ముఖ్యంగా విజయనగరం గంజాయి క్రయ, విక్రయాలకు కేంద్రంగా మారిందని నాడు టిడిపి నాయకులు విమర్శించారు. ఈ విషయంలో ఇప్పటికీ మార్పులు కనిపించడం లేదు.

అధికారంలోకి వస్తే జ్యూట్, ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలకు పునర్జీవనం పోస్తామంటూ అధినేత సహా పలు నియోజకవర్గాలోని ఎమ్మెల్యేలు ఎన్నికల్లో చెప్పారు. మాట నిలబెట్టుకోడం సంగతి అటుంచితే ఇప్పటి వరకు జిల్లాగానీ, రాష్ట్రంలోగానీ ఈ రంగాలపై కనీసం చర్చేలేకపోవడం గమనార్హం. పైగా జీగిరాం, నెల్లిమర్ల జ్యూట్ మిల్లులు మూతపడ్డాయి. ఇచ్చిన మాట ప్రకారం తోటపల్లి, రామతీర్థసాగర్ ప్రాజెక్టులకు నిధులు కేటాయింపులు లేవు. ఝంజావతి ప్రాజెక్టుపై చొరవ చూపలేదు. ఎస్.కోట ఎన్నికల సభలో 'భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని ఎలా ముందుకు తీసుకుపోవాలో ఆలోచిస్తాం అన్న బాబు ఆ దిశగా ఆలోచన చేయలేదు. తోటపల్లి కుడికాలవ ద్వారా గజపతినగరం బ్రాంచి కెనాల్ నిర్మాణం, ఎడమ కాలువ ద్వారా కొమరాడ, జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాలకు సాగునీరు, ఎపి ఇపి డిసిఎల్‌లో గత ప్రభుత్వం విలీనం చేసిన చీపురుపల్లి ఆర్ఇసిఎస్ తిరిగి స్వతంత్రంగా నడుపుతామని, గుమ్మలక్ష్మీపురంలో జీడిపిక్కల ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని, పూర్ణపాడు-లాబేసు వంతన నిర్మాణం పూర్తి, గుమ్మిడిగెడ్డపై మినీ రిజర్వాయర్ నిర్మాణ, నెల్లిమర్ల నియోజకవర్గాన్ని ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దడం, గిరిజనులకు ట్రైకార్ రుణాల మంజూరు ఇలా ఒకటా రెండా ఇవి మచ్చుకు మాత్రమే. వీటిలో ఏ ఒక్కటీ అమలు కాలేదు. చివరికి గిరిజన ప్రాంతంలో పెద్దగా డబ్బులు అవసరం లేని ఏనుగుల నుంచి రక్షణ చర్యలు కూడా ప్రభుత్వం తీసుకోలేకపోయింది.

దృశ్యభాష కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. మండలంలోని తోటపల్లిలో గల జట్టు ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన మన బడి-మన తోట కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ప్రకృతి వ్యవసాయంపై మరింత అవగాహన పెంచడం కోసమే మన బడి- మన తోట కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థుల్లో అధిక శాతం రక్తహీనతతో బాధపడుతున్నారని, వారికి మరింత పౌష్టికాహారం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఖాళీ సమయాల్లో ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ఆకు కూరలు, కూరగాయలు పండించడం నేర్పించాలని పేర్కొన్నారు. పండించిన సేంద్రియ ఆకుకూరలు, కూరగాయాల్లో అధిక పోషకాలుంటాయని వాటిని పిల్లలకు అందించడం వల్ల వారిలో హిమోగ్లోబిన్ పెరిగి, రక్తహీనత తగ్గుతుందని వివరించారు. ఉపాధ్యాయులు ప్రకృతి వ్యవసాయాన్ని అలవాటు చేసుకోవడం కోసమే తోటపల్లి జట్టు ట్రస్ట్, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ శిక్షణా తరగతులను నిర్వహించినట్టు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేసేవారికి ప్రభుత్వం ప్రోత్సహకాలు కల్పిస్తోందని చెప్పారు. ప్రకృతితో కలిసి జీవించడం ప్రతి ఒక్కరు అలవాటు చేసుకోవాలన్నారు. నాబార్డు జిల్లా డిడిఎం ఎస్.దినేష్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతుకు సరైన సహకారం, సుస్థిర అభివృద్ధి ఉన్నప్పుడు మాత్రమే సమాజాభివృద్ధి పూర్తిగా సాధ్యపడుతుందని చెప్పారు. జిల్లా టూరిజం అధికారి ఎస్.నారాయణరావు మాట్లాడుతూ ఈ ప్రాంతం పర్యాటకానికి ఎంతో అనువుగాను, ఆకర్షణీయంగాను ఉంటుందని, ఇలాంటి ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధి చేయడం ఎంతో అవసరమని అందుకోసం జట్టు ట్రస్ట్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. డిఇఒ జి.పగడాలమ్మ మాట్లాడుతూ జిల్లాలోని కొన్ని బడుల్లో ఉపాధ్యాయుల ఆసక్తి మేరకు బడి తోటల సాగు జరుగుతోందని, ఇకపై అన్ని పాఠశాలల్లో బడి తోటల పెంపకాన్ని చేపడతామని అన్నారు. ఇందుకోసం ఉపాధ్యాయులు పాఠాలతో పాటు బడి తోటల సాగుకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అనంతరం పార్వతీపురం పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత, బాలసాహితీ వేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వర రావు రచించిన దృశ్య భాష కవితా సంపుటిని కలెక్టర్ ఆవిష్కరించారు.

కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ రీజినల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ వి. కష్టారావు, డిపిఎం పి.షణ్ముఖ రావు, ప్రకృతి వ్యవసాయ మోడల్ మండల రీజినల్ కో ఆర్డినేటర్ కె. రమాప్రభ, జట్టు వ్యవస్థాపకులు డాక్టర్ డి. పారినాయుడు, విశ్రాంత ఉపాధ్యాయులు పి.ఎస్.ప్రకాశరావు, జట్టు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రహారాజ్, రచయితలు తుంబలి శివాజీ, కిలపర్తి దాలినాయుడు, బెలగాం భీమేశ్వరరావు , టి. శివకేశవరావు, బి. వి. పట్నాయక్, అల్లువాడ కైలాసరావు, డా. బొంతలకోటి శంకర్రావు, పక్కి రవీంద్రనాథ్, వావిలపల్లి రాజారావు, పెంకి గౌరీశ్వరరావు, డా. మంచిపల్లి గోపీనాథ్, డబ్బీరు గోవిందరావు, నల్ల బాలక్రిష్ణారావు, పాయల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులకు రూ.11.75 కోట్లు మంజూరు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం రూ.11.75 కోట్లు మంజూరు చేసిందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకు సంబంధించి రూ.11.75 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు సమర్పించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం ఈ నెల 18న నిధులు మంజూరు చేస్తూ జారీ చేసిందని ఆయన చెప్పారు. రాష్ట్రంలో స్టేట్ హైవే రోడ్లకు, జిల్లా ప్రధాన రహదారులకు అత్యవసర మరమ్మతులు, ప్యాచ్ వర్క్‌లను చేపట్టేందుకు రూ.290.40 కోట్ల మొత్తానికి పరిపాలనా అనుమతిని ఇచ్చిందని ఆయన అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న రహదారులను ఇందులో చేపట్టడం జరుగుతుందని ఆయన చెప్పారు. జిల్లాలో ప్రధాన జిల్లా రోడ్లు (ఎండీఆర్), స్టేట్ హైవే (ఎస్‌హెచ్) రోడ్ల అత్యవసర మరమ్మతులు, ప్యాచ్ పనులకు రూ.11.75 కోట్లతో అంచనాలు సమర్పించగా ప్యాచ్ వర్క్స్ కింద రూ.2 కోట్లతో 72.76 కిలోమీటర్లు, అత్యవసర మరమ్మతుల కింద రూ.9.75 కోట్లతో 128.66 కిలోమీటర్ల మేర మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. 85.88 కిలోమీటర్ల ఎస్‌హెచ్ మరమ్మతులు చేపట్టనుండగా అందులో 19 కిలోమీటర్లను రూ.61లక్షలతో ప్యాచ్ వర్క్స్, 66.88 కిలోమీటర్లు రూ.4.60 కోట్లతో అత్యవసర మరమ్మతులు చేపట్టనున్నట్లు వివరించారు. ఎండిఆర్ కింద 115.53 కిలోమీటర్లు మరమ్మతులు చేపట్టనుండగా అందులో ప్యాచ్ వర్కుల కింద రూ.1.39 కోట్లతో 53.76 కిలోమీటర్లు, రూ.5.15 కోట్లతో 61.78 కిలోమీటర్లను అత్యవసర మరమ్మతుల కింద చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 201.42 కిలో మీటర్లను మరమ్మతులు చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

నేడు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక సాయిరాం గుడి మైదానం వద్ద శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన బాల, బాలికల అండర్ 14, 17 గేమ్స్ అండ్ స్పోర్ట్స్ సెలక్షన్స్ జరుగుతాయని ఎస్ జి ఎఫ్ మన్యం జిల్లా సెక్రెటరీ ఎం.మురళీకృష్ణ, విడిఎస్ఎ సెక్రటరీ పి.చంద్రమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం బాలుర ఎంపిక, శనివారం బాలికల ఎంపికలు జరుగుతాయన్నారు.

ఏచూరి ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కమ్యూనిస్టు ఉద్యమ వీరుడు, పేద, కర్షక, కార్మిక వర్గాల పోరాట యోధుడు, ఎర్రజెండా ముద్దుబిడ్డ కామ్రేడ్ సీతారాం ఏచూరి అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోలక అవినాష్ అన్నారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఏచూరి మరణం పార్టీకి పెద్ద లోటన్నారు. ఆయన మరణించినా ఆయన ఆశయాలు ప్రతి ఒక్క కమ్యూనిస్టు గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు ఎం రమణ, పి.తిరుపతిరావు, ఎం సన్యాసిరావు, కె గౌరీశ్వరరావు, బి శంకర్రావు, కె సుబ్బారావు, బి ఆడితో, బి సత్యం, బి మాధవరావు తదితరులు ఉన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

కొమరాడ : దేశ రాజకీయాల్లో సీతారాం ఏచూరిది కీలక పాత్ర అని, అన్ని వర్గాల సమస్యలపై రాజీలేని పోరాటం చేసిన మేధావి అని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ కొమరాడ ప్రాజెక్టు అధ్యక్షులు గౌరమ్మ అన్నారు. కొమరాడలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్ ప్రాజెక్టు సమావేశం అనంతరం సీతారాం ఏచూరి సంతాపం సభ నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత, గిరిజన, వ్యవసాయ కూలీల సమస్యలపై మాట్లాడిన వ్యక్తి అని, ఆయన జీవితాంతం రాజీ లేని పోరాటం చేసిన మేధావి సీతారాం ఏచూరి అని కొనియాడారు. అలాంటి వ్యక్తి మరణం వర్గాల ప్రజలకు, సిపిఎంకు తీవ్ర నష్టమన్నారు. ఆయన ఆశయ సాధన దిశగా సమస్యలపై సమరశీల పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొమరాడ, గరుగుబిల్లి మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

జిల్లా నాయకులతో జగన్ భేటీ

భవిష్యత్తు కార్యాచరణపై దిశానిర్దేశం

ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులు, అరుకు ఎంపీ డాక్టర్ తనూజా రాణితో వైసిపి అధినేత జగన్ మోహన్‌రెడ్డి గురువారం భేటీ అయ్యారు. తాడేపల్లిలో జగన్ క్యాంపు కార్యాలయంలో మాజీ డిప్యూటీ సిఎంలు రాజన్నదొర, పుష్ప శ్రీవాణి, మాజీ ఎమ్మెల్యేలు జోగారావు, కళావతి, అరుకు ఎంపి తనూజారాణి మాజీ సిఎం జగన్‌మోహన్ రెడ్డిని కలిశారు. వీరితోపాటు మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ కూడా భేటీ అయ్యారు. టిడిపి కూటమి ప్రభుత్వం వందరోజుల పాలన, సూపర్ సిక్స్ పథకాల అమలు వంటి అంశాలపై జగన్ నేతలతో చర్చలు జరిపారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమల్లో ప్రభుత్వం విఫలం కావడంతో భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళిక, వ్యూహాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటానికి సిద్ధం కావాలని, ఒకవేళ ప్రభుత్వం అణిచివేత చర్యలకు దిగితే న్యాయ పోరాటానికి సైతం వెనుకాడేది లేదని ఆయన నేతలకు భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆ దిశగా పార్టీ నాయకులను, కార్యకర్తలను కార్యోన్ముఖుల్ని చేయాలని కూడా అధినేత జగన్ దిశానిర్దేశం చేశారు.

మన్యం జిల్లా వైసిపి నాయకులతో మాట్లాడుతున్న పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి

పరీక్షిత్ రాజుకే మళ్లీ అవకాశం

కురుపాం : పార్వతీపురం మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులుగా శత్రుచర్ల పరీక్షిత్‌రాజుకు మరోసారి ఆ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి అవకాశం కల్పిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శత్రుచర్ల పరీక్షిత్ రాజు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా జిల్లాలో పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. పరీక్షిత్ రాజుకు జిల్లా అధ్యక్షులుగా మరోసారి అవకాశం కల్పించిన నేపథ్యంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జడ్పిటిసి సుజాత, జిల్లా కోప్షన్ సభ్యులు షేక్ నిషార్, మండల కోసం సభ్యులు షేక్ జిలాని, నియోజకవర్గంలో గల మండల కన్వీనర్లు, పలువురు ఎంపిటిసిలు, సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రారంభమైన ఇసుక సరఫరా

కాట్రగడ స్టాక్ పాయింట్‌గా సరఫరా

ప్రజాశక్తి - భామిని

జిల్లాలో ఉచిత ఇసుక సరఫరా ప్రారంభమైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి గురువారం ఇసుక పోర్టల్‌ను ప్రారంభించడంతో జిల్లాలో తక్షణం ఇసుక సరఫరా ప్రారంభమైంది. ఈ మేరకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు. భామిని మండలం కాట్రగడలో లాంఛనంగా ప్రారంభించారు. ఇసుకను పొందేందుకు వినియోగదారులు ఆన్లైన్లో http://www.sand.ap.gov.in పోర్టల్‌లో బుక్ చేసుకోవాలి. వినియోగదారు స్వయంగా లేదా గ్రామ సచివాలయం వద్ద నమోదు చేసుకోవచ్చు. కాట్రగడ వద్ద తవ్వకాలు చేపడుతూ ఇసుక నిల్వ యార్డును ఏర్పాటు చేశారు. కాట్రగడ్డ వద్ద 1,05,300 మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యంగా ఉంది. ఇసుకను ఉచితంగా సరఫరా చేయడం జరుగుతోంది. అయితే ఇసుక తవ్వకాలు, నిర్వహణ తదితర ఖర్చుల కింద రూ.270అంచనా వేశారు. ఈ మొత్తాన్ని, నిర్దేశిత రవాణా చార్జీలు చెల్లించి ఇసుకను ఉచితంగా తీసుకువెళ్లవచ్చు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక అవసరం ఉన్నవాళ్లు ఆన్లైన్ ద్వారా బుక్ చేసుకోవాలని చెప్పారు. ఇసుక పొందుటకు కేవలం తవ్వకాలు, నిర్వహణ, రవాణా చార్జీలు మాత్రమే భరించాలని ఆయన స్పష్టం చేశారు. కేవలం నమోదు చేసుకున్న వాహనాలు మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. సొంత ఇంటి నిర్మాణానికి ఇసుకను ఎద్దుల బండితో తీసుకు వెళ్ళవచ్చని ఆయన సూచించారు. జిల్లాలో ప్రభుత్వ గహ నిర్మాణ పనులకు ఇసుకను వినియోగించడం జరుగుతుందని ఆయన చెప్పారు. జిల్లా వాసులు తమ అవసరాలకు పోర్టల్‌లో బుక్ చేసుకోవాలని కోరారు. వినియోగదారులు చెల్లించాల్సిన ఖర్చులు, రవాణా ఖర్చులు ఆయన తెలిపారు.

ఏనుగుల నుంచి కాపాడండి

- రోడ్లు నిర్మించాలని గిరిజనుల వినతి
- మూడు గంటల పాటు కలెక్టర్ కోసం నిరీక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం

కురుపాం, సీతంపేట మండలాల్లో సంచరిస్తున్న ఏనుగుల దాడుల నుంచి తమ పంటలు నాశనం కాకుండా కాపాడాలని గిరిజనులు కోరుతున్నారు. తాము పండించుకున్న వరి, మొక్కజొన్న, పత్తి, పసుపు పంటలను ఏనుగులు ధ్వంసం చేస్తున్నాయని చెప్పారు. లక్షలాది రూపాయల పంట నష్టం జరుగుతున్నా ప్రభుత్వం నుంచి ఏ విధమైన పరిహారం అందడం లేదని వాపోతున్నారు. అటవీ, రెవెన్యూ అధికారులకు జరిగిన నష్టానికి సంబంధించిన వివరాలు అందజేస్తున్నా ఫలితం కనిపించడం లేదని ఆవేదన చెందుతున్నారు. కురుపాం, సీతంపేట మండలాల్లో గల జరడ, రంగం వలస, సంకిలి, గుండాం, బొద్దమానుగూడ, మూనుగండ, పతాయిగెడ్డ, పొడుదూం, పిత్తిరి గ్రామాల్లో ఏనుగులు సంచరిస్తూ ఆస్తి నష్టం చేస్తున్నాయని, భవిష్యత్తులో మనుషులపైనా దాడులు చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గడచిన రెండేళ్లుగా ఏనుగులతో నరకయాతన అనుభవిస్తున్నామని, అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని చెప్పారు. తిత్తిరి పంచాయతీ బొద్దమానుగూడకు చెందిన పత్తిక తెలుంగు, జడ పంచాయతీ పొడుదూం గ్రామానికి చెందిన ఊయక సింగుల పూరిళ్లను ధ్వంసం చేశాయని తెలిపారు.

మూడు గంటల నిరీక్షణ తర్వాత

మారుమూల గిరిజన గ్రామాలకు చెందిన గిరిజనులు గురువారం ఉదయం 5 గంటలకు బయలుదేరి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి 10.30 గంటలకు చేరుకున్నారు. కొండలు, గుట్టలు కాలినడకన దాటుకుని నీలకంఠాపురం చేరుకుని ఆర్టీసీ బస్సు ద్వారా జిల్లా కేంద్రానికి చేరారు. జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉండడంతో వారు మూడు గంటల పాటు నిరీక్షించారు. అంతకుముందు జెసి శోభిక కలెక్టర్ కోసం కార్యాలయంలో గిరిజనులు వేచివుండడాన్ని చూసి వెళ్లిపోయారు. సరిగ్గా 1.45 గంటలకు జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ బయటకు వచ్చి గిరిజనుల గోడు విన్నారు. ఏనుగుల సమస్య, రోడ్ల నిర్మాణం వంటి అంశాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు.



కలెక్టర్‌కు సమస్య విన్నవించేందుకు నిరీక్షిస్తున్న గిరిజనులు

యువత సైబర్ వారియర్స్‌గా పనిచేయాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

యువత సైబర్ వారియర్, యాంటీ నార్కోటిక్ టాస్క్ ఫోర్సుగా పనిచేయాలని ఎస్పీ ఎస్ వి మాధవ్ రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో గురువారం మున్సిపల్ పరిధిలో పట్టణంలోని కొత్తవలసలో గల శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులతో సమావేశమై వారందరికీ ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలు, మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలకు సంబంధించి పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ సైబర్ నేరం జరిగిన తర్వాత బాధపడే కన్నా నేరం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం మిన్న అన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన చట్టం(బిఎన్ఎస్ సెక్షన్40) ప్రకారం నేరాలు నియంత్రణలో ప్రతి ఒక్కరూ యూనిఫారం లేని పోలీస్‌గా వ్యవహరించవచ్చునన్నారు. ఫేక్ కాల్స్ వచ్చినప్పుడు ప్రశ్నించే తత్వం అలవాటుచేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఉత్తరభారతదేశంలోని జనతార నుంచి ఈ సైబర్ క్రైమ్‌కు ఎక్కువగా పాల్పడుతున్నారని విఒఐపి, విపిఎన్ కాల్స్ ద్వారా ఫోన్లు చేసి భయభ్రాంతులకు గురి చేసి నగదును లూటీ చేస్తున్నారని చెప్పారు. సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే 1930కి కాల్ చేసి సమాచారం ఇవ్వడం వల్ల నేరాన్ని కొంతమేర నియంత్రించవచ్చని అన్నారు. అదేవిధంగా యువత మత్తుపదార్థాలకు బానిస కాకూడదని వాటివల్ల జీవితం నాశనమవుతుందని తెలిపారు. ఎవరైనా మత్తుపదార్థాలకు బానిసైనట్టు తెలిసినా, రవాణా, అమ్మకం, వినియోగం గురించి ఎటు వంటి సమాచారం వున్నా దగ్గరలో వున్న పోలీస్ స్టేషన్‌ల్లో గానీ, 1972కు గాని,100కు సమాచారం అందించాలని తెలిపారు. అనంతరం సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930, మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనార్థాలు గురించి పోస్టర్లను విడుదల చేశారు. అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌డిపిఒ అంకిత సురాన, పట్టణ సిఐ వి.నారాయణ రావు, సోషల్ మీడియా, సైబర్ సెల్ సిఐ జిడి బాబు, పట్టణ ఎస్ఐలు ఎం.గోవింద్, సంతోషి కుమారి, కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్. చలపతిరావు. వైస్ ప్రిన్సిపల్ బి.శాంతికుమారి, ఎన్‌సిసి ఆఫీసర్ డివివిఎస్ గుప్తా పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి, పోలీసు అధికారులు, కాలేజీ ప్రిన్సిపల్

సమస్యలు వినే నాథుడేడి?

ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులు కరువు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాల్సిన మండల పరిషత్ కార్యాలయంలో ప్రధాన అధికారులు మూడునెలలుగా లేరు. దీంతో తమ గ్రామాల్లోని సమస్యలు వినే నాథుడే కరువయ్యాడని ప్రజలు, ప్రజాప్రతినిధులు వాపోతున్నారు. ఇక్కడ పూర్తిస్థాయి ఎంపిడిఒ పోస్టు ఖాళీగానే ఉంది. కార్యాలయంలోని ప్రధాన అధికారులైన ఎంపిడిఒ, ఎఒ, ఇఒపిఆర్డి కుర్చీలు బోసిపోయాయి. ఎన్నికల ముందు వచ్చిన ఎంపిడిఒ అనంతరం బదిలీల్లో ఆయన వెళ్లిపోవడంతో మూడునెలలుగా ఈ పోస్టు ఖాళీగానే ఉంది అలాగే ఎఒ ప్రసాద్ దీర్ఘకాలిక సెలవుల్లోనూ, ఇఒపిఆర్డి కె వర్మ మెడికల్ లీవ్ లో ఉన్నారు. దీంతో ఏదైనా సమస్యపై ప్రజలు వచ్చి చెప్పుకునేందుకు ఎవరూ లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇన్చార్జిగా ఎంపిడిఒ పార్వతీపురం ఎంపిడిఒకు అప్పగించడం ఆయన ఇక్కడికి వచ్చే పరిస్థితి లేదు. పోనీ ఎఒ, ఇఒపిఆర్డిలకు చెబుదామంటే వారు కూడా లేకపోవడంతో తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలంటూ లబోదిబోమంటున్నారు. అంతేకాకుండా మండలంలో 21 సచివాలయాల్లో పనిచేస్తున్న సచివాలయ సిబ్బందిని డిప్టేషన్ పేరుతో పార్వతీపురం కలెక్టరేట్ కార్యాలయాలనికి డ్యూటీలు వేయడంతో సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది అయోమయ పరిస్థితిలో ఉన్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ సిబ్బందిని డిప్యుటేషన్ వేయడంతో ఇక్కడ జరగాల్సిన పనులు జరగడం లేదని ప్రజలు వాపోతున్నారు. కనీసం సచివాలయాల్లోనైనా పనులు జరిగేలా సిబ్బంది ఉండేలా చూడాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. జిల్లా కేంద్రానికి పక్కనే ఉండడంతో సీతానగరం మండలం నుంచే ఎక్కువ మంది సిబ్బందిని డిప్యూటేషన్ పేరిట నియమిస్తున్నారని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు దృష్టి సారించి పూర్తిస్థాయిలో మండల స్థాయి అధికారులను నియమించి, సచివాలయ సిబ్బంది డిప్యుటేషన్లను రద్దు చేయాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

అధికారులు, ప్రజలు లేకపోవడంతో బోసిపోయిన ఎంపిడిఒ కార్యాలయం

ఆరోగ్యశ్రీ సిఇఒ లక్ష్మీశాని కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

లక్ష్మీషాను కలిసిన ఎమ్మెల్యే విజయచంద్ర

జిల్లా కేంద్రంలో ప్రభుత్వ వైద్య సేవల మెరుగుకు సహకరించాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఎన్టిఆర్ ఆరోగ్యశ్రీ రాష్ట్ర అధికారి లక్ష్మీషాను కోరారు. ఎమ్మెల్యే గురువారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జిల్లా వైద్యశాలల వివరాలు అందించారు. జిల్లా కేంద్రంలోని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్య సేవలు త్వరగా అందుబాటులోకి వచ్చేలా తమవంతు సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే లక్ష్మీషాను కోరారు. అలాగే మంజూరైన మెడికల్ కళాశాల పనులు వేగవంతానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే తెలిపారు. జిల్లాలో వైద్య సేవల మెరుగుకు తన వంతు కృషి చేస్తానని లక్ష్మీషా తెలియజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

డ్రాయింగ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కొమరాడ

డ్రాయింగ్ పరీక్షల్లో మండలానికి చెందిన గిరిజన సంక్షేమ గురుకుల బాలుర విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మణరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ లో నిర్వహించిన టెక్నికల్ సర్టిఫికేట్ కోర్సు (టిసిసి) పరీక్షల్లో డ్రాయింగ్ లోవర్ విభాగంలో కొమరాడ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలకు చెందిన టి.రాంబాబు ప్రథమ శ్రేణి, డి.గోవర్ధన్, ఎ.వినోద్ కుమార్, హెచ్.ధనుంజయ, హెచ్.కిరణ్, ఎస్.వంశీ వర్ధన్ ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత పొందినట్లు తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన పాఠశాల ఉపాధ్యాయులు కె.అప్పారావుదొరను, విద్యార్థులను ప్రిన్సిపల్ అభినందించారు. విద్యతోపాటు డ్రాయింగ్, ఆటలు, విద్య, వైజ్ఞానిక ప్రదర్శనల వంటి అంశాల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు తదుపరి డ్రాయింగ్ హైయర్ గ్రేడు పరీక్ష ఈ ఏడాది రాయనున్నట్లు తెలిపారు. లోవర్, హైయర్ ఉత్తీర్ణులైతే డ్రాయింగులో టీచరు ట్రైనింగు కోర్సు చదివేందుకు అర్హత సాధిస్తారని తెలిపారు.

పిహెచ్‌సిలో రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ విజయపార్వతి

పిహెచ్‌సిల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్/మక్కువ

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విజయపార్వతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గురువారం ఉదయం బందలుప్పి, మక్కువ, శంబర, మామిడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రి రికార్డులు, మందుల స్టాక్ పొజిషన్ పరిశీలించి తగిన సూచనలిచ్చారు. ల్యాబ్ తనిఖీ చేసి మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షలు, నివేదికలు పరిశీలించారు. ప్రతి నెలా నమోదవుతున్న జ్వర పీడితుల వివరాలు పరిశీలించారు. జ్వరాలు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో డెమో సన్యాసిరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజన్ డాక్యుమెంట్‌లో ప్రజాభిప్రాయాలు పొందుపర్చాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంతో అధికారులు ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అన్నారు. జిల్లా కలెక్టర్లతో స్వర్ణాంధ్ర విజన్ - 2047పై గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వర్ణాంధ్రకు రానున్న ఐదేళ్లకు వార్షిక ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామ సభలు నిర్వహించాలన్నారు. ప్రజల వద్ద నుండి అభిప్రాయాలు సేకరించాలని స్పష్టం చేశారు. ప్రణాళికలో ప్రజల సూచనలు, సలహాలను స్వీకరించాలన్నారు. ప్రజా సంబంధమైన వార్షిక ప్రణాళిక ఉండాలని, ప్రజలు భాగస్వాములయ్యేందుకు క్యూ ఆర్ కోడ్ అందుబాటులోకి తెస్తామన్నారు. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయగానే ప్రజల అభిప్రాయాలను పొందుపర్చవచ్చన్నారు. విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. జిల్లాలో ఆర్థిక, సామాజిక అంశాల పట్ల ప్రణాళికలో స్పష్టమైన అంశాలు పొందుపర్చాలని ఆయన సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

సైబర్ క్రైమ్ నివారణ చర్యల్లో భాగంగా మండలంలోని పెద్దూరులో అవగాహన కార్యక్రమాన్ని స్థానిక ఎస్ఐ పి.రమేష్ నాయుడు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ కూడా తెలపవద్దని, ఏ అధికారులు ఫోనుల్లో వ్యక్తిగత సమాచారం అడగరని, ఎవరైనా బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని, మీ వ్యక్తిగత వివరాలు, ఒటిపి తెలపాలని అడిగితే అటువంటి సమాచారాన్ని ఇవ్వవద్దు అని తెలిపారు. అలాగే మత్తుపదార్థాల నివారణలో భాగంగా యువత వాటిపై ఆకర్షితం కాకూడదని, యువతపై వారి తల్లిదండ్రులు ఎల్లవేళలా నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ శంకర్రావు, ఉమామహేశ్వరరావు, మహిళా కానిస్టేబుల్ శ్రీలక్ష్మి, స్థానికులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రానికి సమీపంలో గల మూలిగూడ జంక్షన్ ఆవరణంలో ఎస్ సొసైటీ సహకారంతో పుష్పగిరి కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్న నేత్ర వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పుష్పగిరి సిఎస్ఆర్ మేనేజర్ యు.రమాదేవి కోరారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో గల ఎస్ సొసైటీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా కంటి చూపు రెటీనా, ఇతర కంటి సమస్యలు ఉన్నవారు ఈ శిబిరానికి వస్తే వారికి నిపుణులైన వైద్యులతో తగిన పరీక్షలు చేసి ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సతో పాటు భోజనం, రవాణా, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. అలాగే ఆపరేషన్ అయిన తర్వాత మందులు, కళ్లద్దాలు ఉచితంగా అందించి వారంలో ఒకసారి, నెల తర్వాత మరొకసారి రోగి వద్దకు వచ్చి పరీక్షలు కూడా చేస్తామన్నారు. కావున ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరానికి వచ్చే వారు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ సొసైటీ అధ్యక్షులు షేక్ గౌస్ పాల్గొన్నారు.

శివారు కాలనీలకు తాగునీరు సరఫరా

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పట్టణానికి ఆనుకుని ఉన్న నిర్వాసిత కాలనీ ప్రజలకు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర స్పందించి ట్యాంకర్లతో వారికి తాగునీరు పంపిణీ చేశారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులు గురువారం బంటువానివలస, కోటవానివలస నిర్వాసిత కాలనీలకు మున్సిపల్ సిబ్బంది తాగునీరు అందించారు. తాగునీటి సమస్యపై ఎమ్మెల్యే గ్రామీణ నీటి సరఫరా అధికారులకు వివరణ కోరగా డి-సిర్లం పైలట్ ప్రాజెక్టులో ఏర్పడిన సాంకేతిక సమస్యల వల్ల బాలగొడబ నుంచి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించి తాగునీటి సరఫరా కొనసాగిస్తామని తెలిపారు.

వట్టిగెడ్డ నీరందించాలి : సిపిఎం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని రావాడ వట్టిగెడ్డ రిజర్వాయర్ ఎడమ కాలువ పరిధిలో గల జియ్యమ్మ వలస, బొడ్డవలస, అర్నాడ, తుమ్మిగూడా, బొమ్మిక, గెడ్డ తిరువాడ తదితర గ్రామాలకు సాగునీరందక రైతులు ఆందోళన చెందుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యులు కొల్లు గంగు నాయుడు అన్నారు. గురువారం ఆయన గిరిజన రైతులతో కలిసి వరి పంటను సందర్శించారు. వేల రూపాయలు మదుపులు పెట్టి సాగుకు సిద్ధమైన వరి రైతుల ఆవేదన ఇంతా అంతా కాదని అన్నారు. ప్రాజెక్టులో సాగునీరు పుష్కలంగా ఉన్నప్పటికీ ఈ ప్రాంతం రైతులకు నీరందని పరిస్థితి ఏర్పడిందని, ఇందుకు ప్రధాన కారణం కాలువ పనులు పూర్తి స్థాయిలో జరగక అధికారుల నిర్లక్ష్యం చేశారన్నారు. వట్టిగెడ్డ రిజర్వాయర్ ఎడమ కాలువ దిగువన సుమారు 17వేల ఎకరాల భూమి సాగునీరందించాలని, కానీ ప్రస్తుతం 10 వేల కంటే ఎక్కువ సాగునీరందడం లేదని, దిగువ ఆయికట్టుకు నీరందడం లేదని అన్నారు. మరో వారం రోజుల్లో నీరందకపోతే సుమారు 500 ఎకరాల వరకు వరి పంటకు నష్టం వాటిల్లే పరిస్థితి ఉందని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతుల మధ్య ఎటువంటి తగాయిదాలు లేకుండా కాలువల నిర్వహణ సక్రమంగా చేసి మరమ్మతులు చేపట్టాలని, వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి జైకా నిధులను పూర్తిస్థాయిలో ఖర్చుచేసి కాలువ లైనింగ్ చేయాలని వట్టి గెడ్డ రిజర్వాయర్లో సిల్ట్ తొలగించాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో నీరందకపోతే రైతులను కూడగట్టి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల సిపిఎం కార్యదర్శి కోరంగి సీతారాం రైతులు పాల్గొన్నారు.

26 వరకు గ్రామసభలు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

స్వర్ణాంధ్ర @ 2047 విజన్ డాక్యుమెంట్ రూప కల్పనకు ఈనెల 26లోగా గ్రామ సభలు నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. స్వర్ణాంధ్ర ఏ 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం మండల ప్రత్యేక అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏడాదికి 15 శాతం వృద్ధి రేటు సాధనే లక్ష్యంగా స్వర్ణాంధ్ర @2047 విజన్ ప్రణాళికను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక, అభివృద్ధి, ప్రత్యేక అంశాలను దృష్టిలో ఉంచుకుని ఐదేళ్లలో జిల్లా కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని అన్నారు. జిల్లా ప్రణాళిక ఆధారంగా చేసుకుని మండల స్థాయిలో ఐదేళ్ల విజన్ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని చెప్పారు. స్వర్ణాంధ్ర @ 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు సంబంధించి ప్రజలు, వివిధ రంగాల నుండి సూచనలు, సలహాలు, అభిప్రాయాలు, స్పందనను తెలుసుకునేందుకు క్యూఆర్ కోడ్ తో కూడిన ముసాయిదా డాక్యుమెంట్‌ను ఈనెల 21 నుండి అక్టోబరు 5వరకు ఐటి విభాగం ద్వారా ప్రభుత్వ వెబ్ సైట్లో ప్రజలకు అందుబాటులో ఉంచుతామని వెల్లడించారు. స్వర్ణాంధ్ర @ 2047పై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఈనెల 21 నుండి అక్టోబరు 5వ తేదీల మధ్య వివిధ పోటీలను, కళాశాల విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ తదితర పోటీలను నిర్వహించాలని జిల్లా స్పష్టం చేశారు. 100 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 20 నుండి 26వ తేదీ వరకు గ్రామ సభలను (ప్రజా వేదిక) నిర్వహించాలని సూచించారు. సచివాలయ సిబ్బందిని గృహాలకు మ్యాపింగ్ చేయాలని, ఇంటింటికి వెళ్లి కరపత్రాలు, డోర్ స్టిక్కర్లు అందజేసి వివరాలను తెలియజేయాలని అన్నారు. గ్రామ సభలు నిర్వహించి ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమ పర్యవేక్షణకు పార్వతీపురం నియోజక వర్గానికి జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక, సాలూరుకు పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, పాలకొండకు సబ్ కలెక్టర్ ఎస్ యశ్వంత్ కుమార్ రెడ్డి, కురుపాంకు డ్వామా పీడీ కె.రామచంద్రరావును నియమిస్తున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ జి.కేశవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లు సోకిన వరిదుబ్బును పరిశీలిస్తున్న రైతు

వరిచేలకు తెగులు... రైతన్నకు దిగులు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలో వరి సాగు చేసే రైతుల్లో దిగులు నెలకొంది. పచ్చదనంతో ఉండాల్సిన పంటచేలు ఎరుపు రంగు మారి కుళ్ల తెగులు సోకడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. అంకుల్లు1064 రకాలు ఎక్కువ శాతం తెగుళ్ల బారిన పడుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. అయినా క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలనకు వచ్చిన దాఖలాల్లేవని రైతులు ఆరోపిస్తున్నారు. మండల వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్తే ఎప్పుడూ తాళాలు వేలాడుతూనే ఉంటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురుగు మందుల దుకాణాల వద్ద చూపించి వారిచ్చే మందులను పిచికారి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని దబ్బగెడ్డకు చెందిన రైతులు డి.పోలినాయుడు, ఎస్.ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి వరి పంట పొలాలను పరిశీలించి రైతులకు తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు..

పెద్దూరులో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని దశమంతపురం సచివాలయం పరిధి పెద్దూరులో గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పి జ్వర పీడితులతో పాటు మధుమేహ, రక్త పోటు, తదితర రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, రోగులు పాల్గొన్నారు.

ఆదర్శవంతంగా పరిశుభ్రత డ్రైవ్ : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత డ్రైవ్ ఆదర్శవంతంగా జరగాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. జిల్లా అంతటా పరిశుభ్రతకు సంబంధించిన కార్యకలాపాల్లో సమష్టి కార్యాచరణ, పౌరులలో భాగస్వామ్య స్ఫూర్తితో ముందడుగు వేయాలని ఆయన సూచించారు. జిల్లాలో జరుగుతున్న స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని మరింత చక్కగా నిర్వహించి పరిశుభ్రమైన పరిసరాలను ఏర్పాటు చేయాలని గురువారం ఒక సందేశంలో పేర్కొన్నారు. గురువారం జిల్లా వ్యాప్తంగా మూడోరోజు పరిశుభ్ర కార్యక్రమాలు జరిగాయి.

సీతానగరం: మండలంలోని నిడగల్లు పంచాయతీ కార్యదర్శి పి.తిరుపతిరావు ఆధ్వర్యంలో ర్యాలీలో నిర్వహించి అవగాహన కల్పించారు. పెద్ద అంకలాం, సుమిత్రాపురం, కృష్ణారాయిపురం పంచాయతీ కార్యదర్శులు గౌరి, శ్రీనివాసరావు, సోమేశ్వరరావు ఆధ్వర్యంలో కొనసాగించారు. మండలంలో 35 పంచాయతీల్లో ఆయా పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో కొనసాగించారు.

పార్వతీపురం రూరల్ : వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉంటామని తమంత తాముగా ప్రతినపూనాలని ఎంపిడిఒ అకిబ్ జావేద్ అన్నారు. మండలంలో కొనసాగుతున్న స్వచ్ఛ హి సేవా కార్యక్రమాల్లో భాగంగా ఎంపిపి మజ్జి శోభారాణితో కలిసి మండల కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల శుభ్రతకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని, దీనిపై గ్రామాల్లో పూర్తి అవగాహన కల్పించే బాధ్యత పంచాయతీరాజ్ సిబ్బందేనని అన్నారు. కార్యక్రమంలో ఎఒ రమణమూర్తి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : నిడగల్లులో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు, వైద్య సిబ్బంది

కొమరాడ : మండలంలోని విక్రమపురంలో పంచాయతీ కార్యాలయం వద్ద స్వచతా హీ కార్యక్రమం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంపిటిసి సభ్యులు దేవకోటి వెంకటనాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు పరిశుభ్రతపై అవగాహన పెంపొందించుకొని గ్రామాన్ని ఆరోగ్యవంతంగాఉంచేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి జి.త్రినాధరావు, పంచాయతీ కార్యదర్శి భీమయ్య, పల్లి రామారావు, కళింగ శంకరరావు,నేతుల రామారావు, బిజేపీ,జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాంలో విరాళాలు సేకరిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

ప్రజాశక్తి - కురుపాం

విజయవాడ వరద బాధితుల కోసం మహాత్మ జ్యోతిబాపూలే ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఎస్ఎంసి చైర్మన్ డి.మణి ఆధ్వర్యాన గురువారం కురుపాం వారపు సంతలో తమ సిబ్బంది, విద్యార్థులతో ర్యాలీగా వెళ్లి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ వరదల్లో సర్వస్వం కోల్పోయిన బాధితుల కోసం ఏదో తమకు తోచిన సాయం అందజేయాలనే లక్ష్యంతో విరాళాల సేకరణ చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు ఆధ్వర్యంలో అడ్డాపు శిల పంచాయితీ పిన్నింటి రామినాయుడు వలసతో పాటుగా పలు గ్రామాల్లో విరాళాల సేకరించారు. తమ వంతు కర్తవ్యంగా ఇప్పటికే బాధితులకు సహాయక చర్యల్లో సిపిఎం పాల్గొని పలు సహాయాలు అందించిందని, వారికి మద్దతుగా విరాళాలు సేకరించి సిపిఎం రాష్ట్ర నాయకుల ద్వారా ఆర్థిక సహాయాన్ని బాధితులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల సిపిఎం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రిసోర్స్‌పర్సన్ నాగేశ్వరరావు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యాన ప్రకతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యసాయం చేయడం ద్వారా నేలను ఆరోగ్యంగా ఉంచడం, నీటి సంరక్షణ, జీవవైవిధ్యాన్ని ప్రోత్సహించడం, నీరు, వాయు కాలుష్యం తగ్గించడం ద్వారా భవిష్యత్తు తరాల ప్రయోజనాలు కాపాడడంతో పాటు ప్రజలందరికీ సురక్షితమైన పోషక ఆహారాన్ని అందించడం ముఖ్యోద్దేశ్యం అని అన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా రైతుకు పెట్టుబడి చాలా తక్కువ అవుతుందని చెప్పారు. సేంద్రియ ఎరువులు (ద్రవ, ఘన జీవామృతం, నీ మస్త్రం) తయారీ, ఉపయోగాలు ప్రజలపై ఇతర చెడు ప్రభావాలు ఉండవని వివరించారు. రసాయనిక ఎరువులకు, సేంద్రియ ఎరువులకు గల తేడా వివరించారు. వరిసాగులో రాజీలేని సూత్రాలు, లైన్ శోయింగ్, కాలిబాటలు, పసుపు అట్టలు, ఉపయోగాలు, గులరాగి విధానం, చిరుధాన్యాలు ప్రాధాన్యత, పంటల విస్తరణ చెప్పుతూ సేంద్రియ ఎరువు తయారీ డెమో చేసి చూపించారు. శిక్షణకు లక్కాయిగూడ, బంబడుగూడ, చాపరాయిగూడకు చెందిన చిరంజీవిరావు ,రైతులు పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదు

ప్రజాశక్తి - బలిజిపేట

హత్య కేసులో నిందితుడికి జీవిత కాలం కఠిన కారాగార శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ పార్వతీపురం రెండో జిల్లా, సెషన్స్ జడ్జి ఎస్.దామోదరరావు తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ ఎస్‌వి మాధవ్ రెడ్డి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. బలిజిపేట మండలం పెదపెంకికి చెందిన బట్టి వెంకట రావును అదే గ్రామానికి చెందిన ముద్దాయి మత్సా అప్పలనాయుడు ఎన్నికల్లో కోసం జరిగిన చర్చలో కోపంతో కర్రతో తలపై కొట్టగా, మృతుడు స్పృహ తప్పి పడిపోయారు. దీంతో బంధువులు హాస్పిటల్‌లో జాయిన్ చేయగా 2019 మే 20న చికిత్స పొందుతో మరణించాడు. మృతుడు కుమారుడు దత్తి రమేష్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ ఎస్.రవి కేసు నమోదు చేశారు. అనంతరం ఈ కేసును అప్పటి బొబ్బిలి సిఐ ప్రసాదరావు దర్యాప్తు చేసి నిందితుడ్ని అరెస్టు చేసి, కోర్టులో హాజరు పర్చారు. ఈ కేసులో ప్రాసిక్యూషను పూర్తి అయ్యేలా బలిజిపేట పోలీసులు చర్యలు చేపట్టగా, నిందితుడిపై నేరారోపణలు రుజువు కావడంతో సదరు నిందితుడికి జీవిత కాలం కఠిన జైలు శిక్ష , రూ. 1000 జరిమానా జడ్జి దామోదర్ రావు గురువారం తీర్పు వెల్లడించారని తెలిపారు. పోలీసుల తరుపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటరు గొర్లె వెంకటరావు వాదనలు వినిపించగా, పార్వతీపురం డిఎస్పీ పర్యవేక్షణలో సిఐ పార్వతీపురం రూరల్ సర్కిల్, బలిజిపేట ఎస్ఐ వై సింహాచలం, కోర్టు కానిస్టేబుల్ కాశయ్య, త్రినాధ్ సాక్షులను సకాలంలో కోర్టులో హాజరు పర్చారన్నారు. కేసులో నిందితుడికి శిక్షపడేలా వాదనలు వినిపించిన పిపి గొర్లె వెంకటరావును, అప్పటి దర్యాప్తు అధికారి సిఐ ప్రసాదరావు, ఎస్ఐ, పార్వతీపురం రూరల్ సిఐ గోవిందరావు, బలిజిపేట ఎస్ఐ వై సింహాచలం, కోర్టు కానిస్టేబుళ్లను అభినందించారు.

బాలికల్లో రక్తహీనత నివారణకు కృషి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

బాలికల్లో రక్తహీనత నివారణకు కృషి చేయాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ టి. జగన్మోహనరావు స్పష్టం చేశారు. డాక్టర్‌బిఆర్ అంబేద్కర్ గురుకులం(బాలికల) హాస్టల్ ను గురువారం సందర్శించారు. ప్రిన్సిపల్, వైద్య సిబ్బంది, హాస్టల్ సిబ్బందితో సమీక్షించి విద్యార్థుల ఆరోగ్య వివరాల రికార్డులు, సిక్ రిజిస్టర్లను పరిశీలించారు. హిమోగ్లోబిన్ పరీక్షల నివేదికలను తరగతుల వారీగా పరిశీలించి రక్తహీనతతో ఉన్న విద్యార్థులకు తీసుకుంటున్న నివారణ చర్యలపై అడుగ్గా వారికి ఐరన్ పోషకాలు ఉన్న ఆహారాన్ని ప్రత్యేకంగా ఇస్తూ, ప్రతి రోజూ ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేయిస్తున్నామని, అదేవిధంగా బరువు(బిఎంఐ) తక్కువగా ఉన్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నామని ప్రిన్సిపల్ తెలిపారు. విద్యార్థుల హెల్త్ కార్డులను పరిశీలించారు. ముఖ్యంగా కిశోర బాలికల్లో రక్తహీనత ఉన్న వారిని సత్వరమే గుర్తించాలని సూచించారు. కిచెన్, హాస్టల్ ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు పలు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో మాట్లాడి ఎవరికైనా ఆరోగ్య పరంగా ఏవైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్.సంధ్యారాణి, సిహెచ్ఒ బి.చిన్నమ్మి, సూపర్వైజర్ జయగౌడ్, ఎంఎల్‌హెచ్‌పి వెంకటలక్ష్మి, హాస్టల్ ఎఎన్ఎం స్వర్ణలత, వైద్య, గురుకులం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు ఫోలిక్‌యాసిడ్ మాత్రలు వేయిస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ

వీరఘట్టం : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం వైద్య తనిఖీలు నిర్వహించారు. స్వచ్ఛతహీసేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వైద్య తనిఖీలు నిర్వహించి వారి వివరాలను నమోదు చేయనున్నట్టు ఎంపిడిఒ వై.వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ ఇఒ ఎం.రవి, సచివాలయ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

స్వచ్ఛతపై మత్స్యకారులకు అవగాహన

ప్రజాశక్తి - పాచిపెంట

మత్స్యకారులు స్వచ్ఛతపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి వి.తిరుపతియ్య తెలిపారు. మండలంలోని కోడికాళ్లవలసలో గిరిజన మత్స్యకారులకు బయో సెక్యూరిటీ, స్వచ్ఛతపై గురువారం అవగాహన కల్పించారు. మత్స్యకారులకు సేఫ్టీ జాకెట్లు పంపిణీ ఏచశారు. స్వచ్ఛత పాటిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌సిఒ బాలాజీ, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి వై.శ్రీదేవి, స్థానిక మత్స్యకారుల సంఘం అధ్యక్షులు బి.జోగారాజు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - పాచిపెంట

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన మండలంలోని అమ్మవలసలో జరిగింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అమ్మవలసకు చెందిన కోట జగన్నాధం (27) బుధవారం రాత్రి మృతి చెందాడు. వ్యక్తి గత కారణాల వల్ల మనస్థాపానికి గుర్రై ఈనెల 15న జగన్నాథం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే కుటుంబీకులు సాలూరు ప్రభుత్వాసుత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందాడు. మెరుగైన వైద్యం కోసం విశాఖ కెజిహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మెంటాడ

మండలంలోని మీసాలపేట గ్రామానికి చెందిన బగ్గాం రాజు(50) గురువారం రైలు కిందపడి మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. రాజు కొద్దిరోజుల నుంచి నడుము నొప్పితో బాధపడుతున్నాడు. గురువారం ఇంటి నుంచి రాజు బయటకు వెళ్లి, ఎంత సేపటికీ తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు వెతికారు. రైలుపట్టాలపై ఆయన మృతదేహం కనిపించింది. బొబ్బిలి రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్ట్ మార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.